క్లుప్తంగా

కూకట్‌పల్లి ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి దరఖాస్తు



గాంధీభవన్‌లో దరఖాస్తు చేస్తున్న దండుగుల యాదగిరి

ఓల్డ్ బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా శుక్రవారం టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి శుక్రవారం గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన వారికి టికెట్ కేటాయించాల్సి వస్తే ముందుగా తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరామని తెలిపారు.

జేఎన్‌టీయూ విద్యార్థులకు మేలు చేద్దాం

జేఎన్‌టీయూ వీసీతో పూర్వవిద్యార్థులు



జేఎన్‌టీయూ వీసీ కట్టా నరసింహారెడ్డిని కలిసిన పూర్వవిద్యార్థి బృందం సభ్యులు

బాలానగర్: జేఎన్‌టీయు యూనివర్సిటీ పూర్వ విద్యార్థి బృందం శుక్రవారం యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ కట్టా నరసింహారెడ్డిని ఆయన సమావేశ మందిరంలో కలిసింది. అమెరికా, కెనడా పేరుగల యూనివర్సిటీల్లో ఎంటెయూ చేసుకొని జేఎన్‌టీయూ విద్యార్థులకు మేలు చేద్దామని పూర్వ విద్యార్థి బృందం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కట్టా నరసింహారెడ్డి మాట్లాడుతూ.. మీ సహాయ సహకారాలతో తప్పకుండా విదేశీ యూనివర్సిటీలను సందర్శిస్తానన్నారు. పూర్వపు విద్యార్థి బృందంతో కలిసి పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విదేశాల్లో ఉన్న పూర్వపు విద్యార్థి బృందం సభ్యులు శ్రీహరి, సత్య, సైమన్, కిషోర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి చాగంటి ప్రవచనాలు

మోతీనగర్: మోతీనగర్‌లోని శ్రీశృంగేరి శారదా శంకరమఠం, శాంతా–వసంతా ట్రస్టు సౌజన్యంతో యువ భారతి సాహితీ సాంస్కృతిక సంస్థ వజ్రోత్సవాల నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సాహిత్య ఉపన్యాసాల కార్యక్రమం నిర్వహించనున్నారు. ‘‘శ్రీమద్రామాయణం – మానవీయ సంబంధాలు’’పై బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం ఉంటుందని అధ్యక్షుడు డా. ఆచార్య ఫణీంద్ర తెలిపారు. ఈనెల 27, 28వ తేదీల్లో సాయంత్రం 6గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కూకట్‌పల్లిలో బీజేపీదే విజయం

మహారాష్ట్ర ఎమ్మెల్యే అమిత్ భాస్కర్

మోతీనగర్: మోతీనగర్‌కమ్యూనిటి హాలులో మూసాపేట, అల్లాపూర్ డివిజన్‌ల బూత్ అధ్యక్షుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహారాష్ట్ర అంబేరి నియోజకవర్గ ఎమ్మెల్యే అమిత్ భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్‌స్థాయిలో పార్టీని ఏ రకంగా బలోపేతం చేయాలో వారు వివరించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఏ రకంగా ప్రజలకు వివరించాలో తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఉన్న అన్ని డివిజన్‌లలో తాను తిరగానని ప్రతి డివిజన్‌లో మన కార్యకర్తలు చాలా పటిష్టంగా ఉన్నారన్నారు. అలాగే అనేక సంఘాలతో మాట్లాడానని వారి నుంచి బీజేపీకి అశేషమైన ఆదరణ ఉందని తెలిపారు. తప్పకుండా రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కూకట్‌పల్లి నియోజకవర్గంలో గెలవబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు.

జోరుగా కాంగ్రెస్ బస్తీ భరోసా యాత్ర

ఓల్డ్‌బోయిన్‌పల్లి: డివిజన్‌లో నిర్వహిస్తున్న బస్తీ భరోసా యాత్రలో ప్రజలు తమ సమస్యలను ఏకరవు పెడుతున్నారని టీపీసీసీ సభ్యులు గొట్టిముక్కల వెంగళ్‌రావు, సత్యం శ్రీరంగం, దండుగుల యాదగిరి తెలిపారు. రేషన్ కార్డులు, పింఛన్లు రావడం లేదని చెబుతున్నారని ప్రభుత్వం అర్హులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన బస్తీ భరోసా యాత్ర మాలబస్తీ, గొడబస్తీ, వడ్డెర బస్తీ, హరిజన బస్తీ, ఛత్రిగడ్డ, సిండికేట్ బ్యాంక్ కాలనీ, పందుల బస్తీల్లో కొనసాగింది. ఈ కార్యక్రమంలో నాయకులు గోపిశెట్టి రాఘవేందర్, తూము వేణు, తూము సంతోష్, అస్లాం, విజయలక్ష్మి, రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



బస్తీ భరోసా యాత్రలో కాంగ్రెస్ నాయకులు

‘డబుల్’ పారదర్శకత!

- అర్హులైన పేదలకు డబుల్ ఇళ్ల కేటాయింపు
- టాంపర్ ఫ్రీ సాఫ్ట్‌వేర్‌తో అర్హుల ఎంపిక
- ఉప్పల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లిలో 2వేల మంది ఎంపిక
- కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో నిరుపేదలకు సొంతింటి కల సాకారమవుతోందని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఇళ్లు లేని పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న సదుద్దేశ్యంతో డబుల్ బెడ్‌రూమ్ కళ్ల కట్టించి, వాటిని ఎంతో పారదర్శకంగా కేటాయిస్తోందని, ఎలాంటి పైరవీలు, జోక్యం లేకుండా లబ్ధిదారులకు అందజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి మల్లారెడ్డి, జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్, సంబంధిత జిల్లా శాఖల అధికారులు, మీడియా సమక్షంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపును ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఆన్‌లైన్ డ్రా నిర్వహించి, లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని కూకట్‌పల్లి, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయించినట్లు తెలిపారు. ఒక్కో నియోజకవర్గానికి 500 మంది లబ్ధిదారుల చొప్పున నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 2 వేల మంది అర్హులైన లబ్ధిదారులను ప్రత్యేక సాఫ్ట్‌వేర్ (టాంపర్ ఫ్రీ) ద్వారా ఎంపిక చేసి, వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 1,75,959 దరఖాస్తులు వచ్చాయని శుక్రవారం వరకు అర్హత కలిగిన లబ్ధిదారులు 24,717 మంది ఉన్నారని తెలిపారు. ప్రతి నియోజకవర్గం నుంచి మొదటి విడతగా 500 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి ఇళ్ల కేటాయించడం జరిగిందన్నారు. ఇలాంటి ప్రక్రియ దేశంలోనే మొదటిసారిగా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ ప్రక్రియతో అర్హులైన పేదలందరికీ ఇళ్ల కేటాయింపు జరిగేంత వరకు నిరంతరం కొనసాగుతుందని మంత్రి వివరించారు.

ఇళ్ల కేటాయింపులో పారదర్శకత: కలెక్టర్ అమయ్‌కుమార్

జిల్లావ్యాప్తంగా అర్హులైన నిరుపేదల సొంతింటి కల సాకారం చేసే విధానంలో భాగంగా పారదర్శకంగా, జవాబుదారి తనంతో వ్యవహరించామని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. జాతీయ సమాచార కేంద్రం(ఎన్ఐసీ) వారి సహకారంతో తారుమారు చేయకుండా ఉండేలా(టాంపర్ ఫ్రీ) సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రజాప్రతినిధుల సమక్షంలో అర్హులైన వారికి ఇళ్లను కేటాయించామన్నారు. కేటాయింపుల విషయంలో ఎలాంటి అనుమానాలు, అపోహలకు తావులేదన్నారు. అలాగే తక్కువ సమయంలో అర్హులైన లబ్ధిదారుల ఎంపిక జరిగేలా సాఫ్ట్‌వేర్ డెవలప్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఒకసారి ఎంపికైన లబ్ధిదారుడు మళ్లీ ఎంపిక కాకుండా ఉండేందుకు ఆధార్ నంబర్ ప్రాతిపాదికన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించామని పేర్కొన్నారు. ఈ విధానంతో సమయం, తేదీ కూడా సాఫ్ట్‌వేర్‌లో నమోదవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పి.రవీందర్, రోడ్లు భవనాల శాఖ అధికారి శ్రీనివాసమూర్తి, సీపీవో మోహన్‌రావు, ఆర్డీవోలు రాజేష్‌కుమార్, శ్యామ్‌ప్రకాశ్, డిప్యూటీ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవార పూజలు

- ఇళ్లు, దేవాలయాల్లో వరలక్ష్మి వ్రతాలు
- వాయినాలు ఇచ్చుకున్న మహిళలు



కరెన్సీ నోట్లతో ప్రత్యేక అలంకరణలో భ్రమరాంబ అమ్మవారు



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్–2లోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని అమ్మవారికి కరెన్సీ నోట్లతో వరలక్ష్మీదేవిగా అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త శ్యామల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు అఖిలేశ్వర శర్మ వేద మంత్రాల సాక్షిగా అమ్మవారికి పూజలు చేశారు. సామూహిక కుంకుమ పూజలు, శ్రీ లలిత సహస్రనామార్చనలు, గణపతి హోమం, స్వామివారికి బిల్వపత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. మంగళవాయిదాయల నడుమ అమ్మవారికి భక్తులు గీతాలాపనలు, నృత్యాలు, భజనలు చేస్తూ సందడి చేశారు. మహిళా ముత్తయిదువులకు భక్తులు వాయినాలు అందించి ఆశీర్వాదం తీసుకున్నారు.

ఓల్డ్‌బోయిన్‌పల్లి: డివిజన్ పరిధిలోని భవానీనగర్ దుర్గభవానీ ఆలయం, గంగపుత్ర సంఘం దుర్గమ్మ ఆలయం, హస్మత్‌పేట ప్రసన్నాంజనేయ స్వామి, విజయదుర్గ మాత దేవాలయంతో పాటు ఇళ్లల్లో మహిళ శుక్రవారం వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. మహిళలు వాయినాలు (పసుపు, కుంకుమ) ఇచ్చుకున్నారు. అనంతరం ఇంట్లో భోజనాలు పెట్టారు. ఆలయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.



వల్లబ్‌నగర్‌లో పూజలో మహిళలు



చిన్నారికి పసుపుబొట్టు ఇస్తున్న మహిళలు

తక్కువ ధరకే సర్వైకల్ కేన్సర్ వ్యాక్సిన్



వ్యాక్సిన్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న విక్రమ్‌దేవ్ రావు, మీరారావు, వైద్యులు



రాందేవ్‌రావ్ ఆస్పత్రిలో సర్వైకల్ కేన్సర్‌కు వ్యాక్సిన్ అందజేస్తున్న వైద్యురాలు

ఆల్విన్‌కాలనీ: సమాజానికి సేవ అందించేందుకు రాందేవ్ రావ్ ఆస్పత్రి మరో అడుగు ముందుకు వేసింది. అందులో భాగంగా సర్వైకల్ కేన్సర్‌ను అరికట్టేందుకు అతి తక్కువ ధరలో రూ.4వేల ఖరీదైన వ్యాక్సిన్‌ను రూ.వెయ్యికే అందిస్తున్నారు. రాందేవ్‌రావ్ ఆస్పత్రి 15వ వార్షికోత్సవం సందర్భంగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విక్రమ్‌దేవ్ రావు, మీరారావు ప్రారంభించారు. కూకట్‌పల్లి, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఛాయాదేవి కోరారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ.. ఈ వ్యాక్సిన్ తీసుకుంటే గర్భాశయ ముఖద్వార కేన్సర్‌ను పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు. డాక్టర్ భవాని దివ్య పిల్లల వైద్య నిపుణురాలు మాట్లాడుతూ.. ప్రతి శనివారం ఆస్పత్రి మూడో అంతస్తులో ఓపీడీ వద్ద వ్యాక్సిన్ వేస్తారన్నారు. వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత గంటసేపు వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. డాక్టర్ కమలాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పాదయాత్ర

మోతీనగర్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేపట్టిన పాదయాత్ర శనివారం ఉదయం 7గంటలకు మూసాపేట డివిజన్‌లో నిర్వహించనున్నారు. డివిజన్‌లోని బాలాజీ స్వర్ణపురి కాలనీ పార్కు వద్ద ఈ పాదయాత్ర ప్రారంభించి మోతీనగర్, స్నేహపురి కాలనీ, కబీర్ నగర్‌లలో కొనసాగిస్తారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్‌తో పాటు అన్ని విభాగాలకు చెందిన అధికారులు పాల్గొననున్నారు. స్థానికులు ఏమైనా సమస్యలు ఉంటే ఆయన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కాలనీ ప్రతినిధులు, స్థానికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా చెరుకు కుమారస్వామి జన్మదిన వేడుకలు



చెరుకు కుమారస్వామి దంపతులను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు, అభిమానులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయం ఫౌండర్, చైర్మన్ చెరుకు కుమారస్వామి జన్మదిన వేడుకలు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. పుట్టిన రోజు పురస్కరించుకొని ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదికను ఏర్పాటు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని గజమాలతో సత్కరించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్తలు, అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు ఇవ్వకపోతే ఇంటికే పరిమితం చేయాలి



ఆల్విన్‌కాలనీలో మాట్లాడుతున్న బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్‌యాదవ్

ఆల్విన్‌కాలనీ: అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కలెక్టరేట్ కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం బయల్దేరిన జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డితో పాటు నాయకులను అరెస్టు చేశారు. ఈ అక్రమ అరెస్టులను బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్‌యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఆల్విన్‌కాలనీ బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ నాయకులను అరెస్టు చేయటం హేయమైన చర్య అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అప్రజాస్వామిక విధానాలను అవలంభిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో నిరంకుశ పాలనను కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి డబుల్ ఇళ్ల నిర్మాణం కోసం నిధులు పంపిస్తే ఆ నిధులను పక్కదారి పట్టించిందని ఆరోపించారు. వెంటనే అర్హులందరికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చారి, ఆంజనేయులు, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లు ఇచ్చే వరకు పోరాడతాం...

కూకట్‌పల్లి: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందించాలని కలెక్టరేట్ ముట్టడికి శుక్రవారం బయలుదేరిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూజ.. ఇంకా ఎన్నిసార్లు గృహ నిర్బంధం చేస్తారని ప్రశ్నించారు. పేదలకు ఇళ్లు అందే వరకు పోరాడతామన్నారు. త్వరలోనే అవినీతి ప్రభుత్వానికి ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారన్నారు.

బీసీబంధుతో చేతివృత్తిదారుల కుటుంబాల్లో వెలుగులు



కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బీసీ బంధు లబ్ధిదారులు

ఆల్విన్‌కాలనీ: చేతి వృత్తిదారుల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం బీసీ బంధు పథకం ప్రవేశపెట్టి ఆర్థిక భరోసా అందజేస్తోందని ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిపొందిన నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు శుక్రవారం ఆయనను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రూ.లక్ష ఆర్థిక సాయంతో చేతివృత్తిదారుల కుటుంబాల్లో వెలుగులు నిండాయని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విడతల వారీగా దరఖాస్తుదారులను ఎంపిక చేస్తారన్నారు. అర్హులందరికి దశలవారీగా ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాస్, నరసింహులు, బండి మల్లేష్, పోచయ్య, రమేష్, సతీష్, జగన్, కృష్ణ, రాములు, శంకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యుడిని చేరదీసిన రాజరాజేశ్వరి ఆశ్రమం



చెట్టుకింద దీనస్థితిలో ఉన్న వయోవృద్ధుడు



ఆశ్రమంలో వృద్ధుడితో అబ్బులు, రాజేశ్వరి

ఆల్విన్‌కాలనీ: తిండి తిప్పలు లేక ఓ వయో వృద్ధుడు చెట్టు కింద దీనస్థితిలో ఉండడంతో కూకట్‌పల్లి ఆస్‌బెస్టాస్ కాలనీకి చెందిన అబ్బులు శుక్రవారం అతడిని చేరదీసి మానవత్వాన్ని చాటుకున్నారు. నాలుగు రోజుల నుంచి కాలనీలో చెట్టు కిందనే ఉండటంతో అతని వివరాలు అడిగి తెలుసుకోగా ఏమి చెప్పకపోవటంతో కూకట్‌పల్లి ఆల్విన్‌కాలనీలోని రాజరాజేశ్వరి వృద్ధాశ్రమ నిర్వాహకురాలు రాజేశ్వరిని సంప్రదించి ఆశ్రమంలో చేర్పించారు. అతనికి ఎవరూ లేరని చెప్పడన్నారు. ప్రథమ చికిత్స చేయించి అండగా నిలిచారు.

పారిశుద్ధ్య కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి



ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మద్దతు తెలుపుతున్న మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు

కూకట్‌పల్లి: మూసాపేట జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు టీపీసీసీ సభ్యుడు గొట్టిముక్కల వెంగళరావు శుక్రవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వటట్లాడుతూ.. కార్మికుల నిరసన చేసిన రోజులు భోజనాల ఖర్చు భరిస్తానని హామీ ఇచ్చారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వస్తే మన బతుకులు మారుతాయి అనుకున్నామని కానీ కేవలం కేసీఆర్ కుటుంబ మాత్రమే బాగు పడిందని ఆవేదన వ్యక్తం వ్యక్తం చేశారు. కరోనా కష్టకాలంలో జీహెచ్‌ఎంసీ కార్మికుల కృషి అనిర్వచనీయమైనదని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. జీతాలు పెంచి, ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. విషయాన్ని పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేటట్లు కాంగ్రెస్ పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బషీర్, గోపిశెట్టి రాఘవేందర్, సతీష్ గౌడ్, రమేష్, సుధాకర్‌రెడ్డి, ప్రసన్న కుమార్, కృష్ణవేణి, అరుణ్, గురుమూర్తి, గణేష్, ఎన్ఎస్‌యూఐ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే కార్మికులను పర్మనెంట్ చేస్తాం

పారిశుద్ధ్య కార్మికులను పర్మనెంట్ చేయాలని ఐదు రోజులుగా కార్మికులు ధర్నా చేస్తున్నారు. శుక్రవారం శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జ్ గజ్జల యోగానంద్ కార్మికుల ధర్నాకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ నియంతృత్వ పాలన మూడు నెలల్లో అంతమవుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడగానే కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏకాంత్ గౌడ్, అశోక్, రమేష్, రత్నం, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

మద్దుతుగాధర్మ సమాజ్ పార్టీ ప్రచార కమిటీ

మూసాపేట జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు బాలానగర్ మండల ధర్మ సమాజ్ పార్టీ ప్రచార కమిటీ నాయకులు శుక్రవారం మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు కరోనా లాంటి కష్టకాలంలో ప్రాణాలకు తెగించి చేసిన సేవలను కొనియాడారు. అదే విధంగా ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు చేసిన వాగ్దానాలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో పరుశురాం మహారాజ్, సురేష్, శ్రీనివాస్, రాములు తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల నిరసనకు మద్దతు తెలుపుతున్న గజ్జల యోగానంద్



మూసాపేటలో మద్దతు తెలుపుతున్న ధర్మ సమాజ్ కమిటీ నాయకులు

కార్మికుల డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్తా



ధర్నా చేస్తున్న కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: మూసాపేటలోని మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికుల దీక్షకు శుక్రవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులతో మాట్లాడారు. తాను ఒక కార్మికుడినేనని కార్మికుల బాధను అర్థం చేసుకున్న వ్యక్తిగా కార్మికుల న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. గతంలో రూ.6వేల జీతాన్ని నేడు రూ.17,500 చేసిన గొప్పవ్యక్తి కేసీఆర్ అని అన్నారు. కార్మికుల డిమాండ్లను తప్పనిసరిగా సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఆయన సానుకూలంగా స్పందిస్తారని భరోసా ఇచ్చారు. అందులో ఎటువంటి సందేహం లేదన్నారు.

ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మొద్దు..

◆ కాంగ్రెస్, బీజేపీ నాయకుల కల్లబొల్లి మాటలు చెప్పి మభ్యపెడితే వారిని నమ్మొద్దని సూచించారు. వారు పరిపాలించిన రాష్ట్రాల్లో కార్మికుల జీతాలు ఎంత ఉన్నాయో తెలుసుకొని ఇక్కడికి వచ్చి మాట్లాడాలన్నారు. అంతేకానీ ప్రతి దానిని రాజకీయం చేసి ఇష్టానుసారం ప్రజల జీవితాలతో ఆడుకోవద్దని హితవు పలికారు. తాను వైస్‌చైర్మన్‌గా ఉన్నప్పుడే ఎంతోమంది నిరుపేదలను కార్మికులుగా తీసుకున్నామనన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకున్న గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఇతర పార్టీల నాయకుల మాటలు నమ్మొద్దని ఖచ్చితంగా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.